# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక స్థైర్యాన్ని అందించే యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ గత 12 ఏళ్ల కాలంలో దేశ అంతర్గత భద్రతను పటిష్టం చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు.
- ❖ ప్రధాన ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా భారత్ ఆవిర్భవించిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.
- ❖ భారత రక్షణ రంగం స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

======================

అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక స్థైర్యాన్ని అందించే యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. ఫ్రాన్స్‌లోని ఎవియన్ నగరంలో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సమావేశంలో `అందరి ప్రయోజనం కోసం సమతుల్య సమ్మిళిత సుస్థిర ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం` అనే ఇతివృత్తం మీద ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వాణిజ్యాన్ని వేగవంతం చేయడానికి అంతర్జాతీయ సమీకరణ భాగస్వామ్యం ఏర్పాటు చేయాలని సూచించారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్.. అనే సూత్రాలపై భారతదేశ వృద్ధి ఆధారపడి సాగుతోందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కొద్దిసేపటి క్రితం అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశమయ్యారు. ఇరువురు నేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. హర్మూజ్ జలసంధి వద్ద వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పశ్చిమాసియాలో శాంతి కోసం అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కృషి చేశారని అన్నారు. హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందని, ఆ ప్రాంతంలో ఎలాంటి ఆంక్షలు లేని స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ఒక ప్రధాన ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా ఆవిర్భవించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. పూణేలోని రంజన్‌గావ్ MIDCలో అమెరికాకు చెందిన జాబిల్ కంపెనీ కొత్త తయారీ కేంద్రాన్ని ఈ రోజు ప్రారంభించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచంలోనే ఆరవ అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఎగుమతిదారుగా భారత్ ఉందన్నారు. రాబోయే సంవత్సరాల్లో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఎగుమతిదారుగా అవతరించాలని దేశం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దేశంలో మహా నగరాల మధ్యన రైళ్ల అనుసంధానం వేగంగా జరుగుతోందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

గత 12 ఏళ్ల కాలంలో దేశ అంతర్గత భద్రతను పటిష్టం చేశామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. జాతీయ భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వం దృఢ నిబద్ధతను చాటుకుంటోందని సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఈరోజు పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో పాటు.. దేశంలో నక్సలిజం నిర్మూలన, ఈశాన్య ప్రాంతంలో 12 ఒప్పందాలతో అంతర్గత భద్రతను బలోపేతం చేశామని గుర్తు చేశారు. అదే విధంగా సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి వాటి ద్వారా సరిహద్దులో ఉన్న శత్రువులకు ధీటైన జవాబు చెప్పామని అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ రంగం స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ రంగ ఉత్పత్తుల విలువ ఏకంగా లక్షా 78 వేల కోట్ల రూపాయలకు చేరుకుందని సామాజిక మాధ్యమ పోస్టులో ఆయన ఈరోజు వెల్లడించారు. ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సరికొత్త మైలురాయిని అధిగమించిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 110 శాతం వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. దేశీయంగా తయారీ ఒకప్పటితో పోలిస్తే విపరీతంగా పెరగడం, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం మరింత విస్తరించడం, రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరగడం ఈ భారీ వృద్ధికి దోహదపడిందన్నారు. దేశ రక్షణ రంగ బలానికి ఇది నిదర్శనమని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలతో రానున్న రోజుల్లో ఈ రంగం మరింత వేగంగా ముందుకు సాగుతుందన్న ఆశాభావాన్ని కేంద్రమంత్రి వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం మంత్రి అమిత్ షా న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక సమావేశంలో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 పని తీరును సమీక్షించారు. దానిని మరింతగా సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను సులభతరం చేయడానికి కృత్రిమ మేధ (ఏఐ) వంటి వాటిని ఉపయోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఫిర్యాదుకు సరైనా పరిష్కారం లభించేందుకు రాష్ట్రాలతో కలిసి పని చేయాలన్నారు. అలాగే బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం వల్ల తలెత్తే ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని అమిత్ షా కోరారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ స్థిరత్వం, భద్రతా సహకారం, అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరాలను ఎదుర్కొనే ప్రయత్నాలపై దృష్టి సారించాలని జీ-7 సదస్సు పేర్కొంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని జీ-7 సదస్సు

స్వాగతించింది. ఈ ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించడానికి, ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడానికి మంచి అవకాశమని వివిధ దేశాలకు చెందిన నాయకులు అభివర్ణించారు. హార్మూజ్ జలసంధి గుండా సురక్షితమైన సముద్ర రవాణాకు వీలుంటుందని పేర్కొన్నారు. ప్రాంతీయ భద్రతను బలోపేతం చేసే చర్యలకు జీ-7 మద్దతు ఉంటుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

`ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) కింద సుమారు 2,400 కోట్ల రూపాయల విలువైన ప్రోత్సాహకాలను ఈ నెల 19న న్యూఢిల్లీలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిణీ చేయనున్నారు. ఉపాధి కల్పనను వేగవంతం చేయడం, ఉపాధిని వ్యవస్థీకృత రంగంలోకి తీసుకురావడం, సామాజిక భద్రతా పరిధిని విస్తరించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన ఈ కీలక ఉపాధి-అనుసంధాన ప్రోత్సాహక పథకం అమలులో ఈ పంపిణీ ఒక ముఖ్యమైన మైలురాయి అని ప్రధాన మంత్రి కార్యాలయం ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొంది. దేశవ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది లబ్ధిదారుల ఉపాధి కల్పనకు ఈ పథకం ఇప్పటికే దోహదపడిందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని యువతకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాజస్థాన్‌లోని కోటాలో `ఎకో ఆఫ్ స్టూడెంట్స్' పేరిట ర్యాలీలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. దేశంలోని యువత కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని ఈ సందర్భంగా సామాజిక మాధ్యమ పోస్టులో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అవినీతికి, అణిచివేతకు వ్యతిరేకంగా యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అఫ్గానిస్థాన్ జట్ల మధ్య లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా రెండో వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. భారత్.. నిర్దేశించిన 403 పరుగుల లక్ష్యంతో ఆట ప్రారంభించిన అఫ్గానిస్థాన్ 34 ఓవర్లు పూర్తయ్యే సరికి 6 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 213 పరుగులు చేయాల్సి ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పశ్చిమ బెంగాల్, సిక్కింలోని కొన్ని ప్రాంతాలలో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేసింది. అసోం, మేఘాలయ, బీహార్, కేరళం, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి కారైకల్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆ వివరాలను ఐఎండి శాస్త్రవేత్త త్రిసాను బానిక్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76 వేల 808 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 347 పాయింట్ల లాభంతో 77 వేల 155 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 96 పాయింట్లు లాభపడి 24 వేల 085 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 52 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4 వేల 329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =